క్లుప్తంగా

కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

బాసర: బాసరకు ఇటీవలే కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. మరోవైపు 30 పడకల ఆస్పత్రి కోసం ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రామారావు పటేల్‌తోపాటు సంబంధిత అధికారులు ముమ్మరంగా సర్వే పనులు చేపట్టారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం కోసం సర్వే నంబర్ నాలుగులో సుమారు 28 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి అనువుగా ఉండడంతో అందులోనే ప్రభుత్వ కార్యాలయాలు, 30 పడకల నూతన ఆసుపత్రి భవనాలు, కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి అనుగుణంగా స్థలం ఉండడంతో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని బుధవారం పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ పవన్‌చంద్రను వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సర్వే చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఆర్ఐ అభినవ్ ఉన్నారు.

విశ్వకర్మ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా శివకుమార్

నిర్మల్‌చైన్‌గేట్: విశ్వకర్మ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా వన్నెపన్ని శివకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథచారి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలోని విశ్వకర్మలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి, నాయకులు సతీశ్ చారి, శ్రీనివాస్ చారి, భాస్కర్ చారి పాల్గొన్నారు.

'ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు'

భైంసాటౌన్: మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రామారావు పటేల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.19లక్షలు మంజూరు చేయించగా బురుదుగల్లిలో మేదరిసంఘం భవనానికి సంబంధించిన రూ.2.50 లక్షలను తానే మంజూరు చేయించినట్లు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చెప్పుకుని ప్రొసీడింగ్ కాపీ అందజేయడం సరికాదన్నారు. కౌన్సిలర్ గౌతమ్ పింగ్లే, బీజేపీ నాయకులు పోశెట్టి, వెంకటేశ్, నారాయణ, రాజన్న, రాజు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బైరి నడ్పి ముత్తన్నకు చెందిన మేక విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. బుధవారం మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన ముత్తన్నకు చెందిన మేక చామన్‌పెల్లి సమీపంలో మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ వైర్ తగిలి మృతిచెందింది. మేక విలువ రూ.20 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

హమాలీ వర్కర్ల అరెస్ట్

ఖానాపూర్: పెంచిన సివిల్ సప్లయ్ హమాలీ కూలీల రేట్ల జీవోను విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్‌లో భాగంగా హైదరాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయం ముట్టడికి వెళ్లకుండా బుధవారం మండలంలోని హమాలీలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ పిలుపు మేరకు కార్మికులు వెళ్లకుండా పోలీసులు ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే హమాలీ రేట్ల పెంపుదల జీవోను విడుదల చేసి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు భీమేశ్, రమేశ్, చిన్నయ్య, భూమారెడ్డి, నర్సయ్య, ఉన్నారు.

విద్యుత్ వృథా అరికట్టాలి

సోన్: విద్యుత్ వృథా అరికట్టాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం(సీజీఆర్ఎఫ్)ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ ఎరుకల నారాయణ సూచించారు. సోన్ ఐబీఏఈ సెక్షన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులు సమస్యలు ఉంటే సబ్ డివిజనల్ పరిధిలోనే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. డీఈ నాగరాజు, ఇన్‌చార్జి ఏఈ అనిల్‌కుమార్, టెక్నికల్ ఇంజినీర్ విష్ణు, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'వనరులు పెంచుకోవాలి'

కుంటాల: గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీలు ఆదాయవనరులు పెంచుకోవాలని ఎంపీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. బుధవారం పాడిచెత్త అమ్మకం ద్వారా కుంటాల పంచాయతీకి రూ. 5వేలు ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాపు తదితరులు ఉన్నారు.

కోర్కెలు తీర్చే కోతిదేవుడు!

- జాతర నిర్వహణకు సర్వం సిద్ధం
- 19న రథోత్సవంతో ప్రారంభం
- తరలిరానున్న వేలాది భక్తులు



కోతి దేవుడి సమాధి



కోతి దేవుని ఆలయం

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం -పీచర గ్రామాల మధ్య వెలిసిన కోతిదేవుడు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవుడుగా ఎంతో ప్రసిద్ధి చెందాడు. గతంలో గ్రామంలో కోతి మరణిస్తే గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి కోతికి సమాధి నిర్మించారు. అనంతరం సమాధిపై అద్భుతమైన ఆలయాన్ని నిర్మించడంతో పాటు ఏటా పెద్ద ఎత్తున రెండు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నారు.

ఆలయ చరిత్ర..

గ్రామంలోని పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం.. 1976లో మండలంలోని ధర్మారం గ్రామంలోకి ఒక కోతి వచ్చింది. అది ప్రజలతో మమేకమై ఉండేది. కోతి ప్రజల అవసరాలకు చేదోడు వాదోడుగా ఉండేది. క్రమంగా రైతులకు కోతితో విడదీయలేని బంధం ఏర్పడింది. అయితే రెండేళ్ల గడిచిన తర్వాత కోతి ప్రవర్తనలో మార్పు వచ్చింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు అందరిని కరుస్తూ పంటలను నాశనం చేసేది. దీంతో గ్రామస్తులు దానిని చంపి ఊరి బయట సమాధి చేశారు. కొన్ని రోజుల తరువాత గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కలలోకి కోతి వచ్చి తాను ఆంజనేయ స్వామినని తనకు ఆలయం నిర్మించి పూజలు చేయాలని చెప్పినట్లు, దీంతో ఆలయం నిర్మించి పూజలు చేస్తున్నట్లు పెద్దలు చెబుతున్నారు. కాగా దాతలు ఇచ్చిన విరాళాలతోనే 1978లో ఆలయాన్ని నిర్మించారు.

కోనేరులో స్నానం..

ఏటా జాతర..

ధర్మారం గ్రామంలో కోతిదేవుని జాతరను ప్రతీ డిసెంబర్ 19, 20వ తేదీల్లో ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ నెల 19 గురువారం రాత్రి సమయంలో రథయాత్ర, 20వ తేది శుక్రవారం నిండు జాతర, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ జాతరకు నిర్మల్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మంచిర్యాల, మహారాష్ట్ర నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

మండలంలోని కోతిదేవుని వద్దకు వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలోని కోనేరులో పవిత్ర స్నానమాచరించి స్వామి వారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. కోనేరులో పుణ్యస్నానమాచరించిన భక్తుల చర్మవ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని వారు విశ్వసిస్తున్నారు.

జాతరకు బస్సు సౌకర్యం..

ధర్మారం గ్రామం నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి 20కిలోమీటర్ల దూరం ఉంది. జాతర జరిగే రోజులలో ఆర్టీసీ యాజమాన్యం జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులను నడిపించనున్నారు. నిర్మల్ నుంచి పార్‌పెల్లి, మునిపెల్లికి వెళ్లే బస్సుల ద్వారా భక్తులు కోతిదేవుని జాతరకు చేరుకోవచ్చు.

బందోబస్తు..

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వైద్యురాలు ప్రత్యూష తెలిపారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై సుమలత ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

మహిమ గల దేవుడు



కోతి దేవుడు చాలా మహిమ గల దేవుడు. ఇక్కడకు వచ్చి కోతి దేవున్ని భక్తితో పూజించిన భక్తుల కోరికలు తప్పక నెరవేరుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఏటా వేల మంది భక్తులు జాతరకు తరలివస్తుంటారు.

\- సుమన్, ఆలయ కమిటీ సభ్యుడు

జాతరకు సర్వం సిద్ధం



రెండు రోజుల పాటు జరిగే మహా కోతిదేవుని జాతరకు అన్ని ఏర్పాట్లు చేశాం. 19న రథోత్సవంతో జాతర ప్రారంభమవుతుంది. 20వ తేదీన జాతరకు వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశాం.

\- మేకల చందు, ఆలయ కమిటీ సభ్యుడు

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం



చెక్కు అందజేస్తున్న రఘునందన్ రెడ్డి

లక్ష్మణచాంద: రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని డీసీసీబీ వైస్‌చైర్మన్, లక్ష్మణచాంద ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుడు బాబాపూర్ గ్రామానికి చెందిన రైతు హుస్సేన్ ఇటీవల మృతిచెందగా బీమా కింద రైతు కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. డైరెక్టర్లు కిషన్, చెవ్వ రాజేశ్వర్, రవిశేఖర్, నరేశ్, సురేందర్ రెడ్డి, అర్జున్ రెడ్డి, గంగారాం, సురేశ్ రెడ్డి ఏడీసీసీ మేనేజర్ శ్రీనివాస్, ఉదయ్ పాల్గొన్నారు.

యాసంగి పంటకు సాగు నీరందించాలి



నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న జాన్సన్‌నాయక్

కడెం: కడెం ఆయకట్టుకు యాసంగి పంటలకు సాగు నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ నీటి పారుదలశాఖ అధికారులను కోరారు. బుధవారం కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రాజెక్ట్‌ను సందర్శించి, ప్రాజెక్ట్ నీటిమట్టాన్ని పరిశీలించారు. సాగు నీటిపై స్పష్టతనిస్తే ఆయకట్టు రైతాంగం రెండో పంటల సాగుకు సిద్ధమవుతారని, వెంటనే ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇరిగేషన్ కార్యాలయంలో ఏఈఈ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, నాయకులు సతీశ్, రఫీక్, బాపురావు, తిరుపతిరెడ్డి, కలీం, మల్లేశ్, గంగన్న, చోటు, గణేశ్, రంజిత్, నరేశ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ముమ్మరంగా ఆన్‌లైన్ నమోదు

ఖానాపూర్: మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను బుధవారం ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీవో రత్నాకర్‌రావు మాట్లాడారు. ప్రజాపాలన సభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సురేశ్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ గ్రామ కమిటీ ఎన్నిక

కడెం: మండలంలోని మాసాయిపేట్ బీజేపీ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా బుర్రసాయికుమార్‌గౌడ్, కార్యదర్శిగా మాసం మహేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, నాయకులు సత్తెన్న, కృష్ణ, రాజేందర్, శ్రీరాం, తిరుమల్, బుర్ర నరేశ్‌గౌడ్, తిరుపతిగౌడ్, ఉదయ్, రాజేశ్, మధుకర్, లింగాగౌడ్, మల్లికార్జున్, వెంకటరమణ, రవికుమార్, శేఖర్ తదితరులు ఉన్నారు.

బూత్ కమిటీలు..

సోన్: మండల కేంద్రంలో బీజేపీ బూత్ కమిటీలకు బుధవారం మండల ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, ఎన్నికల పరిశీలకుడు నరేశ్‌ల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. 131వ బూత్ అధ్యక్షుడిగా పేరుపతి రాజు, జనరల్ సెక్రటరీగా గంగారపు నవీన్, 132వ బూత్ అధ్యక్షుడిగా రంజిత్, జనరల్ సెక్రటరీగా భీమేశ్, 133వ బూత్ అధ్యక్షుడుగా ఓరుగంటి వెంకటరమణ, జనరల్ సెక్రటరీగా బోనగిరి సురేశ్, 134వ బూత్ అధ్యక్షుడిగా బంగారు గణేశ్, జనరల్ సెక్రటరీగా అశోక్‌లను ఎన్నుకున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

కుంటాల: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎంఏ రహీఖాన్ పేర్కొన్నారు. బుధవారం కుంటాలలోని పారిశుధ్య పనులు పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న మంచి నీటి ట్యాంకులను నెలకు మూడుసార్లు శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

కుట్టుమిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ మహిళలకు ఇందిరమ్మ మహిళ శక్తి పథకం ద్వారా ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని 12వ వార్డు కౌన్సిలర్ ఫౌజియా తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి గల వారు మీసేవతో పాటు ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

20, 21 తేదీల్లో డిగ్రీ పరీక్షలు

భైంసాటౌన్: పట్టణంలోని గోపాల్‌రావు పటేల్ డిగ్రీ కళాశాలలో ఈనెల 20, 21వ తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య తెలిపారు. బీఎస్సీ, ఎంపీసీ, బీకాం, కంప్యూటర్ ఫస్టియర్ విద్యార్థులకు మొదటిసెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

లక్ష్మణచాంద: మండలంలోని పద్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ప్రశస్త యాప్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేసే అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో అశోక్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుప్పావై ప్రవచనాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర దేవరకోట దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం తిరుప్పావై ప్రవచనాలు బోధించారు. ప్రవచనాలను దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో టీటీడీ ప్రవచకులు రామకన్నన్ నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు నవీన్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

సమ్మెలో సీఆర్టీలు

కడెం: పెండింగ్ వేతనాలు, క్రమబద్ధీకరణ తది తర డిమాండ్లు నెరవేర్చాలని ఈనెల 16 నుంచి గిరిజన ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలు సమ్మె చేస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో పాఠం చెప్పేవారు లేక విద్యార్థులు ఆటలు ఆడుతూ కనిపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లు నెరవేర్చాలని సీఆర్టీలు కోరుతున్నారు. విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. సాక్షి ఉషు క్రీడా విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ దర్శనం దేవేందర్ బుధవారం తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం పొందిందన్నారు.

పీఎంపీల కార్యవర్గం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల పీఎంపీ వైద్యుల కార్యవర్గాన్ని బుధవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లోకేశ్వరం పీఎంపీ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా విక్రమ్, కోశాధికారిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడుగా భూపేశ్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, సలహాదారులు రాజేశ్వర్, రాంప్రసాద్, సుభాష్, ప్రవీణ్, సంజీవ్, రతన్‌లను ఎన్నుకున్నారు. ప్రైవేట్ వైద్యులు రాజేశ్వర్, రాంప్రసాద్‌లు ఉన్నారు.

బ్లాంకెట్ల పంపిణీ

ఖానాపూర్: సత్యసాయి 100వ జయంతి పురస్కరించుకుని మస్కాపూర్ పంచాయతీ పరిధిలో గల గంగాయిపేట్ గిరిజనులకు 40 బ్లాంకెట్లను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం మస్కాపూర్, సుర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లలో సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీంసింగ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయానంద్, సభ్యులు రత్నాకర్‌రావు, సత్తయ్య, నర్సయ్య, సాగర్, తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

సోన్: మండలంలోని కడ్తాల్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ శోభారాణి సత్యనారాయణ గౌడ్ దంపతులు బుధవారం సందర్శించారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ అయ్యప్ప ఆలయాన్ని ఆధ్యాత్మికంగా, అభివృద్ధి పరంగా తీర్చిదిద్దిన అయ్యప్ప గురుస్వామి నర్సారెడ్డి సేవలు మరువలేనివన్నారు. నరసయ్య, భీమేశ్, రాములు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

ముధోల్: మండల నూతన ఎస్సై కే. సంజీవ్‌కుమార్‌ను బుధవారం మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, భైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంనాథ్‌నాయక్‌లు శాలువాలతో సత్కరించారు.

'చలోరాజ్‌భవన్' ర్యాలీలో ఎమ్మెల్యే



ర్యాలీలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: ఆర్థికవేత్త ఆదానీ అవకతవకలు, మణిపూర్ హింసాత్మక ఘటనలపై ప్రధాని మౌనం పాటించడాన్ని నిరసిస్తూ బుధవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ నుంచి రాజ్‌భవన్ వరకు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఆదానీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసమే వలసలు

- ఘనంగా అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం
- ప్రవాసీమిత్ర కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కార్మికసంఘు నాయకులు

నిర్మల్‌ఖిల్లా: దేశం నుంచి గల్ఫ్, ఇతర దేశాలకు పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల యువత, కార్మికులు ఉపాధి నిమిత్తం వలస వెళ్తున్నారని, అంతర్జాతీయంగా విదేశీ మారక ద్రవ్యం సముపార్జనలో తమవంతు పాత్ర పోషిస్తున్నారని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికి పండ్ల అన్నారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం నిర్వహించారు. జిల్లాకేంద్రంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు ఒక దేశం నుంచి మరొక దేశానికి వలసలతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. భారతదేశం నుంచి వెళ్లిన కార్మికులు గల్ఫ్ దేశాల్లో సుమారు 90 లక్షల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. తెలంగాణ నుంచి 15 లక్షల మంది గల్ఫ్ దేశాల్లో ఉన్నారన్నారు. అక్కడ పనుల్లో వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. గల్ఫ్ కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని సూచించారు. సీపీఐ జిల్లా నాయకుడు ఎస్ఎన్.రెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో మృతి చెందుతున్న కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గల్ఫ్ దేశాల నుంచి తిరిగి వచ్చిన కార్మికులకు పునరావాసం, ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు కొమ్ము గీత, మోహన్, లావణ్య, లక్ష్మి, గల్ఫ్ కార్మిక కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

చర్చల పేరుతో కాలయాపన తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: తమ సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని సమగ్ర శిక్ష ఉద్యోగులు పేర్కొన్నారు. డిమాండ్లు నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె బుధవారం 9వ రోజుకు చేరింది. దీక్ష శిబిరాన్ని పలువురు సందర్శించి మద్దతు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సీఎం, మంత్రులు ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. నిరసనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాస్కులు ధరించి బైఠాయించారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో భూసారపు గంగాధర్, రాజారత్నం, నరేశ్, తిరుపతి, నాయక్, కవిత, రజిత, సంధ్య, వనిత, రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



సోన్: నవగ్రహ పూజలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలో గల నడింపల్లె గ్రామంలో బుధవారం పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు పిసుపాటి రేవంత్ శర్మ, గాడిచర్ల గౌతమశాస్త్రి, వామన భట్ల ఆదినారాయణశర్మ, సంతోష్, ప్రహల్లాద్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, వాస్తు పరియజ్ఞకరణం, మంటప దేవతార్చనలు, జలాదివాసం, ధాన్య, ఫల, పుష్ప, షయ్యాదివాసములు, అదివాసాంగ హోమాలు, శాంతిపౌష్టికాలు, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాలకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్‌తో పాటు తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని సంఘంపేటలో మూడు రోజులుగా జరుగుతున్న నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ముగిసిందని వీడీసీ సభ్యులు తెలిపారు. నవగ్రహ, ధ్వజస్తంభ రేకుల షెడ్డుకు సహకరించి ఏర్పాటుకు కృషి చేసిన గ్రామవాసి, మాజీ సర్పంచ్ తుమ్మల భూమారెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. తాజా మాజీ సర్పంచ్ మారి విలాస్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, లింగన్న, గంగన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.

వణుకుతున్న వానరాలు





నిర్మల్ జిల్లా కేంద్రంలో చలి తీవ్రత అధికంగా ఉండడంతో మూగజీవాలు తల్లడిల్లుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కోతులు గల్లీల్లో, రోడ్లవెంట తిరుగుతూ.. చలి తీవ్రత నుంచి ఉపశమనం కోసం నానా తంటాలు పడుతున్నాయి. గుంపులుగా ఒక్క దగ్గరకు చేరడంతో పాటు పిల్లలను గుండెలకు హత్తుకుని చలి నుంచి తమతో పాటు తమ పిల్లలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్